క్లుప్తంగా

మంత్రి కేటీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే ముత్తిరెడ్డి



జనగామ: బీఆర్‌ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో గురువారం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజక వర్గ పరిస్థితులు, అభివృద్ధి తదితర వాటిపై చర్చించారు.

పంట నష్టంపై సర్వే

లింగాలఘణపురం: మండలంలో ఇటీవల కురిసిన వడగళ్లు, ఈదురు గాలులతో కూడిన వర్షాలకు దెబ్బతిన్న వరి పంట నష్టాన్ని గురువారం ఏఓ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో అధికారుల సర్వే బృందం పరిశీలించింది. మంథోనిగూడెం, కళ్లెం, మాణిక్యాపురంలో నివేదికలను తయారు చేశారు. సర్వేలో ఆర్‌ఐ శంషీద్, ఏఈఓ శ్రీనివాసు ఉన్నారు. కాగా ఈ నెల 28న లింగాలఘణపురం, నాగారంలో సర్వే నిర్వహించనున్నట్లు ఏఓ వివరించారు.

నర్సరీ పరిశీలన




లింగాలఘణపురం: మండలంలోని నెల్లుట్ల గ్రామపంచాయతీ పరిధిలోని నర్సరీని గురువారం డీఆర్డీఓ రాంరెడ్డి పరిశీలించారు. నర్సరీ, పల్లెప్రకృతి వనంలో పెంచుతున్న మొక్కలు, ఇప్పటికే పెరిగిన పండ్ల మొక్కలను చూసి ఎంతో సంతోషించారు. ఆయనతో పాటు సర్పంచ్ భర్త భూపాల్‌రెడ్డి, వార్డు సభ్యులు నర్సింహ తదితరులు ఉన్నారు.

నేటి నుంచి ఆంజనేయ స్వామి విగ్రహ పునఃప్రతిష్ఠాపన

జఫర్‌గఢ్: వడ్డెగూడెంలో నేటి నుంచి మూడు రోజుల పాటు అభయాంజనేయస్వామి విగ్రహ పునఃప్రతిష్ఠాపనోత్సవాన్ని దాతలు, గ్రామస్తుల సహకారంతో నిర్వహిమచనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మొదటి రోజు గోపూజ, గణపతి పూజ, అఖండ దీపారాధన తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. రెండో రోజు జలాధివాస యజ్ఞం, చివర రోజు విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మహోత్సవంలో భక్తులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

చరిత్ర ఆనవాళ్లు.. మన కట్టడాలు



పాలకుర్తి టౌన్: ప్రాచీన కాలం నాటి దేవాలయాలు, కోటలు మన సంస్కృతి, చరిత్రకు ఆనవాళ్లుగా నిలుస్తాయని సాహితీవేత్త డాక్టర్ శంకరమంచి శ్యాం ప్రసాద్ అన్నారు. మండల కేంద్రానికి చెందిన ఆయన గురువారం కామారెడ్డి జిల్లా దోమకొండ కోట, అందులోని కాకతీయుల కాలం నాటి ప్రాచీన శివాలయాన్ని సందర్శించారు. సుమారు 800 ఏళ్ల క్రితం కాకతీయులు నిర్మించిన శివాలయం, రుద్రమదేవి సందర్శించినట్టు చెప్పుకునే దేవాలయం, ఆమె వేయించిన శాసనం చెక్కు చెదరకుండా ఉన్నాయని శ్యాం ప్రసాద్ పేర్కొన్నారు. 38 ఎకరాల విస్తీర్ణంలో 400 ఏళ్ల క్రితం నిర్మించిన ఉద్యానవనం.. మధ్యలో కళాఖండంగా నిలిచిన ఇల్లు.. సందర్శకులను ఆకర్షిస్తాయని చెప్పారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడి మృతి

రఘునాథపల్లి: మండలంలోని ఖిలాషాపూర్ గ్రామానికి చెందిన ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం నాయకుడు నక్క రాంచందర్(59) బుధవారం అర్ధరాత్రి గుండెపోటుతో మరణించాడు. మండలంలోని మంగలిబండతండా ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుడు రాంచందర్ హఠాన్మరణం పట్ల గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. గురువారం పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శాగ కైలాసం, ప్రధాన కార్యదర్శి చింత రమేష్, సర్పంచ్ ముప్పిడి శ్రీధర్, ఎంపీటీసీ అల్లిబిల్లి కృష్ణ సంతాపం తెలిపారు.

ఎంపీటీసీ మృతి

జఫర్‌గఢ్: ఓబులాపూర్ గ్రామానికి చెందిన ఎంపీటీసీ సభ్యుడు మోగులుగాని చంద్రయ్య (75) అనారోగ్యంతో గురువారం రాత్రి మృతి చెందారు. కాగా, ఎంపీటీసీ మృతికి ప్రజాప్రతినిధులు, నాయకులు సంతాపం తెలిపారు.

పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

కొడకండ్ల: మాతా శిశు సంక్షేమమే లక్ష్యంగా అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లల ఆరోగ్యం పట్ల అంగన్‌వాడీ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఈజీఎస్ రాష్ట్ర డైరెక్టర్ అందె యాకయ్య కోరారు. గురువారం రామవరం గ్రామ రైతు వేదికలో నిర్వహించిన ప్రీ స్కూల్‌డే మండల స్థాయి కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బాల్యం నుంచే పిల్లలకు మంచి అలవాట్లు నేర్పిస్తూ సన్మార్గంలో పయనించేలా కృషి చేయడంలో అంగన్‌వాడీలు కీలకభూమికను పోషించాలన్నారు. ఈ సందర్భంగా పూర్వ ప్రాథమిక విద్య పూర్తి చేసుకొని వెళ్తున్న పిల్లలకు పట్టాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సురేందర్‌నాయక్, సర్పంచ్, ఎంపీటీసీలు శిరీష, మణెమ్మ, సూపరువైజర్ సరళ, పోషణ అభియాన్ కోఆర్డినేటర్ సోమయ్య, రాజు, నాగమణి, కుమారస్వామి, జ్యోతి, సునీత, మంగ, సరస్వతి, రజిత, రేణుక, ఏలీషా, అరుణ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

రఘునాథపల్లి: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరస్వతి అన్నారు. మండలంలోని ఇబ్రహీంపూర్‌లో జరిగిన ప్రీ స్కూల్‌డేలో ఆమె పాల్గొని మాట్లాడారు. సర్పంచ్ దొరగొల్ల అయిలమ్మ, అంగన్‌వాడీ టీచర్లు హేమలత, రాజమణి, మంజుల, విజయ, ప్రేమలత, హెల్పర్స్ రమాదేవి, ప్రమీల, పాల్గొన్నారు. అలాగే మండలంలోని కోమళ్లలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ బొల్లపల్లి మంజుల, పంచాయతీ కార్యదర్శి అక్తర్, టీచర్లు బొల్లపల్లి ప్రేమలత, సుప్రియ, పాతిమా బేగం తదితరులు పాల్గొన్నారు.



కొడకండ్ల: పట్టాలు పంపిణీ చేస్తున్న యాకయ్య

చిల్పూరు : అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లల ఆరోగ్యం పట్ల టీచర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సర్పంచ్ అరూరి ప్రణీత సూచించారు. మండలంలోని వంగాలపల్లి గ్రామంలో గురువారం అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్ అర్కాల భాగ్యలక్ష్మి అధ్యక్షతన ప్రీ స్కూల్‌డే కార్యక్రమాన్ని నిర్వహించారు.

అంగన్‌వాడీల్లో ఘనంగా ప్రీ స్కూల్ డే

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని శివునిపల్లికి చెందిన అంగన్‌వాడీ టీచర్ల ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఘనంగా ప్రీస్కూల్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీటీసీ గుర్రం రాజు మాట్లాడారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు బూర్ల విష్ణు ముదిరాజ్, పంచాయతీ కార్యదర్శి తిరునగరి శ్రీకాంత్, యంజాల ప్రభాకర్, ఎండీ.దస్తగిరి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంధ్యారాణి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఘన్‌పూర్‌లో..

డివిజన్ కేంద్రంలోని ఆరవ అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్ మునిగాల రాణి ఆధ్వర్యంలో ఘనంగా ప్రీస్కూల్‌డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలకు అసెస్‌మెంట్ ప్రోగ్రెస్ రిపోర్టులను పంపిణీ చేశారు. ఎంపీటీసీ మునిగెల రాజు, వీఓఏ భాగ్యలక్ష్మి, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.



దేవరుప్పుల: సీతారాంపురంలో..



స్టేషన్‌ఘన్‌పూర్: ప్రోగ్రెస్ రిపోర్టులు అందజేస్తున్న ఎంపీటీసీ రాజు

పిల్లల ఉజ్వల భవిష్యత్‌కు అంగన్‌వాడీలు పునాదులు

దేవరుప్పుల: పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు అంగన్‌వాడీ కేంద్రాలు పునాదులుగా దోహదపడుతాయని ఎంపీపీ బస్వ సావిత్రి అన్నారు. గురువారం మండలంలోని సీతారాంపురంలో అంగన్‌వాడీ పిల్లలకు వీడ్కోలు పురస్కరించుకొని గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు.సర్పంచ్ రెడ్డిరాజుల రమేష్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి, పంచాయతీ కార్యదర్శి స్వప్న, వార్డు సభ్యురాలు తదితరులు పాల్గొన్నారు.



రఘునాథపల్లి: మాట్లాడుతున్న సరస్వతి



చిల్పూరు: ప్రీ స్కూల్‌డేలో పాల్గొన్న సర్పంచ్ ప్రణీత

‘భట్టి’కి వీఓఏల వినతి



రఘునాథపల్లి: రెండు దశాబ్దాలుగా చాలీచాలని వేతనాలతో దుర్భర జీవితాలు గడుపుతున్న వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించకుండా రాష్ట్ర ప్రభుత్వం అన్యాయం చేస్తుందని సంఘం నాయకులు.. సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్కకు వినతి పత్రం అందజేశారు. వేలేరు మండలంలో పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో ఉన్న భట్టిని గురువారం కలిసి తమ సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వ ప్రతి కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్న వీఓఏలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని వాపోయారు. వీఓఏల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని భట్టి విక్రమార్క తెలిపినట్లుగా సంఘం నాయకులు పేర్కొన్నారు. భట్టిని కలిసిన వారిలో విఓఏల సంఘం మండల అధ్యక్షుడు కొడిదేటి కుమార్, కందుకూరి యోన, తాళ్లపల్లి హరిశంకర్, గుగులోతు వీరన్న, వెంకటస్వామి పాల్గొన్నారు.

బీజేపీ శ్రేణుల సంబురాలు

చిల్పూరు: 10వ తరతగతి పేపర్ లీకేజీ కేసులో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ని కోర్టు నిర్దోషిగా ప్రకటిస్తూ కేసు కొట్టివేయడంతో మండల కేంద్రంలో బీజేపీ, బీజేవైఎం నాయకులు గురువారం సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వీట్లు పంపిణీ చేశారు. బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు పన్నీరు అశోక్, గొల్లపల్లి వాసు, విజేందర్, తోట శ్రీనివాస్, మధునాయక్, గాలి రాజు, రఘుపతి పాల్గొన్నారు.

కన్యకాపరమేశ్వరి ఉత్సవాలు ప్రారంభం



అమ్మవారికి పూజ చేస్తున్న వేద పండితులు



నగర సంకీర్తలో భక్తులు



ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

జనగామ: పట్టణంలోని ధర్మశాల ఏరియాలో శ్రీవాసవీ కన్యకా పనమేశ్వరీ, నగరేశ్వర, శ్రీ సీతారామచంద్రస్వామి ప్రతిష్ఠా మహోత్సవ వేడుకలు గురువారం ప్రారంభమయ్యాయి. వేదపండితులు మేళ్లచెర్వు అప్పయ్యశాస్త్రీ, కృష్ణమాచారి సిద్ధాంతి మంత్రోచ్ఛారణల నడుమ పూజా కార్యక్రమాలు మొదలు పెట్టారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమునలింగయ్య, కౌన్సిలర్ మహంకాళి హరిశ్చంద్రగుప్త, చాంబర్ గౌరవ అధ్యక్షుడు పజ్జూరి గోపయ్య, జిల్లా బాయిల్డ్ రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పజ్జూరి జయహరి, కిరాణ వర్తక సంఘం అధ్యక్షుడు బుద్దా రమేష్, వ్యాపారులు, ప్రముఖులు, మహిళలు పాల్గొన్నారు.

పట్టణంలో సంకీర్తన..

అమ్మవారి ఉత్సవాల ప్రారంభోత్సవం పురస్కరించుకొని ఆలయం నుంచి రైల్వే స్టేషన్ మీదుగా నెహ్రూపార్కు వరకు నగర సంకీర్త, ఊరేగింపు, ధ్వారతోరణ బంధనం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఈ ఉత్సవాలు మే 3వ తేదీ వరకు కొనసాగనున్నాయి.

కాంగ్రెస్‌లో ‘సస్పెన్షన్’ వార్

- రెండు వర్గాల మధ్య ముదురుతున్న వైరం

పొన్నాలను సస్పెండ్ చేస్తున్నాం



మాట్లాడుతున్న కాంగ్రెస్ సీనియర్ నాయకులు

జనగామ: రాజకీయ భిక్షపెట్టిన జనగామ కాంగ్రెస్‌ను భ్రష్టుపట్టించిన టీపీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్యను నియోజకవర్గం, పార్టీ నుంచి తామే సస్పెండ్ చేస్తున్నట్లు సీనియర్ నాయకులు గిన్నారపు ఆనందం, బొట్ల మల్లయ్య, రాచకొండ ఉప్పలయ్య, బానోత్ బస్సీ, గోదల నర్సయ్య, లింగాల నర్సిరెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని సిద్దిపేట రోడ్డులోని పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. జనగామ ప్రజల ఓట్లతో గెలుపొంది ఎమ్మెల్యే, మంత్రిగా పనిచేసిన పొన్నాల అభివృద్ధిని మరిచారని, ఎన్నికల సమయంలో మాత్రమే ఇక్కడ కనిపించే ఆయన.. పార్టీకి తీరని ద్రోహం చేస్తున్నారని అన్నారు. ఏఐసీసీ అధినేత్రి సోనియాగాంధీ ప్రత్యేక తెలంగాణ ఇచ్చి, పొన్నాలను టీపీసీసీ అధ్యక్షుడిని చేస్తే.. ఎన్నికల్లో పార్టీ విజయం సాధించేలా అభ్యర్థులకు టికెట్లు ఇవ్వకుండా.. కేసీఆర్‌కు తొత్తుగా వ్యవహరించాడని ఆరోపించారు. స్థానిక ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డిపై వస్తున్న అనేక ఆరోపణలపై ఇతర పార్టీలు భగ్గుమంటుంటే.. పొన్నాల మాత్రం కిమ్మనకపోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. పార్టీ, ప్రజల కోసం పని చేస్తున్న తమను కొందరు ఫోన్‌లుచేసి బెదిరిస్తున్నారని, తామంతా ఏకగ్రీవ నిర్ణయంతో పొన్నాలను సస్పెండ్ చేస్తున్నాం.. అధిష్టానం కలుగ చేసుకుని ఆయనను శాశ్వతంగా బయటకు పంపించాలని కోరారు. సమావేశంలో సుంకరి శ్రీనివాస్‌రెడ్డి, మోటే శ్రీనివాస్, కన్నెబోయిన గూడెం మాజీ సర్పంచ్ లక్ష్మీనారాయణ, ధరావత్ లక్ష్మి పాల్గొన్నారు.

కొమ్మూరిని సస్పెండ్ చేస్తున్నాం



మాట్లాడుతున్న లింగాజీ

జనగామ : నియోజకవర్గంలో కాంగ్రెస్ అధిష్టానం తీసుకునే నిర్ణయాలను ఉల్లంఘిస్తూ.. పార్టీ వ్యతిరేఖ కార్యకలాపాలకు పాల్పడుతున్న మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని సస్పెండ్ చేస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ లింగాజీ తెలిపారు. పార్టీ జనగామ నియోజకవర్గ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కొమ్మూరి కాంగ్రెస్ పార్టీకి నష్టం కలిగించేలా వ్యవహరిస్తున్నాడని, ఈ విషయమై రాష్ట్ర కాంగ్రెస్, ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ క్రమశిక్షణ కమిటీకి ఫిర్యాదులు రాగా.. రాష్ట్ర, జిల్లా నాయకత్వం ఆయనను ఎన్నోసార్లు హెచ్చరించినా తీరు మార్చుకోలేదన్నారు. వచ్చే సాధారణ ఎన్నికల నేపథ్యంలో ప్రతాప్‌రెడ్డి పార్టీ మారుతాడనే ఆలోచన ఉన్నట్లు అధిష్టానం దృష్టిలో ఉందని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే జాతీయ కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ నిబంధన నియమావళి మేరకు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు స్పష్టం చేశారు. సమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ చెంచారపు శ్రీనివాస్‌రెడ్డి, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు బడికె ఇందిరకృష్ణస్వామి, ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు లోకుంట్ల ప్రవీణ్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు నారాయణరెడ్డి, పట్టణ అధ్యక్షుడు ధర్మపురి శ్రీనివాస్, మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, మజీద్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

దేశానికే ఆదర్శం తెలంగాణ



జిల్లా కేంద్రంలో 30వ వార్డులో బీఆర్‌ఎస్ ఆవిర్భావ వేడుకల్లో నాయకులు

జనగామ: దశాబ్దాల క్రితం ఉద్యమ పార్టీకి పురుడు పోసి, తెలంగాణ ఆత్మగౌరవాన్ని, అస్తిత్వాన్ని పునఃప్రతిష్ఠించి అనతి కాలంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా నిలిపిన వ్యక్తి సీఎం కేసీఆర్ అని జనగామ పట్టణ ప్రధాన కార్యదర్శి ఊడుగుల నరసింహులు కొనియాడారు. బీఆర్‌ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం జిల్లా కేంద్రంలోని 30వ వార్డులో కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. ముత్తిరెడ్డి సేవా సంస్థ జనగామ నియోజవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ తిప్పారపు విజయ్‌కుమార్, పార్టీ సీనియర్ నాయకులు తిప్పారపు ఆనందం, బొల్లం సుభాస్, మెంట నర్సింగరావు, వార్డు మహిళా అధ్యక్షురాలు మాదారపు మరియ, గడిపే రాజ్‌కుమార్, టింకు, రాజమణి తదితరులు పాల్గొన్నారు.

మహాసభను జయప్రదం చేయాలి



నర్మెట: వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

నర్మెట /బచ్చన్నపేట: ఈ నెల 29,30 రెండు రోజులు జిల్లా కేంద్రంలోని వైష్ణవి గార్డెన్స్‌లో నిర్వహించనున్న రజక వృత్తిదారుల రాష్ట్ర 3వ మహాసభలను జయప్రదం చేయాలని సంఘం మండల నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గురువారం స్థానిక రజక భవనంలో వాల్‌పోసర్లను విడుదల చేసిన నాయకులు మాట్లాడారు. అంజయ్య, సత్యనారాయణ, శ్రీనివాస్, కనకయ్య, నర్సింహులు, శ్రీధర్, నర్సింగ్, కనకయ్య ఉన్నారు.

రైతులు అధైర్య పడొద్దు



స్టేషన్‌ఘన్‌పూర్: అకాల వర్షాలతో రైతులు అధైర్య పడొద్దని, చివరి ధాన్యం గింజవరకూ కొనుగోళ్లు చేస్తామని రైస్ మిల్లర్ల అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బెలిదె వెంకన్నగుప్తా అన్నారు. డివిజన్ కేంద్రంలో ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. అకాల వర్షాలతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, ప్రకృతి వైపరీత్యాలకు ఎవ్వరూ అతీతులు కాదన్నారు. అయితే బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో సీఎం కేసీఆర్ రైతుల పక్షపాతిగా, రైతుబాంధవుడిగా పనిచేస్తూ గ్రామగ్రామాన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారన్నారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు జాప్యం చేయకుండా కొనుగోళ్లు చేయాలని, రైతులకు అండగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉందన్నారు. రైస్ మిల్లర్లు అందరం రైతుల పక్షపాతిగా ఉంటామని ఆయన భరోసా ఇచ్చారు.

ధాన్యం విక్రయంలో రైతుల ఇబ్బందులు



ధాన్యాన్ని తూకం వేయిస్తున్న శ్రీనివాస్

జనగామ రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల వడడండ్ల వర్షంతో రైతులకు త్రీవ నష్టం జరగగా.. ఉన్న కొద్దిపాటి ధాన్యాన్ని విక్రయించడంలో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని వడ్లకొండ, మరిగడి గ్రామాల్లో రైతులకు సంబంధిత అధికారులు టోకెన్లు ఇవ్వకపోవడంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. మండల రైతుబంధు అధ్యక్షుడు ప్రమోద్ రెడ్డి, నాయకుడు ఎడ్ల శ్రీనివాస్, సెంటర్ వద్దకు వెళ్లి అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు చేపట్టి వెంటనే తూకం వేసి లారీల్లో తరలించాలని అన్నారు.

తేమ లేకుండా ధాన్యం తీసుకురండి

లింగాలఘణపురం: రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చే సమయంలోనే తాలు, తేమ లేకుండా తీసుకొస్తే త్వరగా కాంటాలు నిర్వహించడం జరుగుతుందని కళ్లెం పీఏసీఎస్ చైర్మన్ ఉపేందర్ అన్నారు. గురువారం మండలంలోని గుమ్మడవెల్లిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. సర్పంచ్ శ్రీపాల్‌రెడ్డి, జనగామ మార్కెట్ డైరెక్టర్ రవి, సొసైటీ సీఈఓ మల్లేశం, రైతులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి

స్టేషన్‌ఘన్‌పూర్: రైతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఐకేపీ ఏపీఎం కవిత అన్నారు. మండలంలోని పాంనూర్‌లో ఐకేపీ సెర్ప్, డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకుంటూ సరైన మద్దతు ధర పొందాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ రేణుక, ఎంపీటీసీ రజిత, నాయకులు డాక్టర్ కరుణాకర్‌రెడ్డి, గ్రామైక్య సంఘం బాధ్యులు, రైతులు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఉపేందర్

ఆలయ నిర్మాణానికి పూజ

చిల్పూరు: మండలంలోని కృష్ణాజీగూడెంలో దుర్గమ్మ నూతన ఆలయ నిర్మాణానికి అర్చకుల వేదమంత్రాల నడుమ గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్, మాజీ సర్పంచ్ సాదం వెంకటయ్య మాట్లాడుతూ గ్రామ ప్రజల సహకారం, దాతల విరాళంతో నిర్మిస్తున్న దుర్గమ్మ ఆలయం కోసం పాత గుడిలో ఉన్న అమ్మవారి విగ్రహాన్ని అందులో నుంచి తీసి పక్కన ప్రతిష్ఠించే కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు.

భద్రాచలంలో కోడూర్ భజన బృందం



రఘునాథపల్లి: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో శ్రీ ఆదిశంకరాచార్యజయంతి వేడుకల సందర్భంగా మండలంలోని కోడూర్ శ్రీ రామదాసు భజన మండలి బృందం గురువారం పాల్గొని భజనలు చేశారు. భజన మండలి రాష్ట్ర సేవా సొసైటీ అధ్యక్షుడు ఎస్‌వీఎస్ సిద్దేశ్వర్ సారథ్యంలో 19 మందితో కూడిన బృందం పాల్గొని భజనలు చేసి అభినందనలు అందుకున్నారు. భజన మండలి సభ్యులు గొరిగె అంజమ్మ, శోభ, ఎలేంద్ర, యాదలక్ష్మి, లలిత, రేణుక, లక్ష్మి, రాధ, వీరమ్మ, యాకమ్మ, నర్సమ్మ, సోమలక్ష్మి, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

అంధత్వ నివారణకే ‘కంటి వెలుగు’

పాలకుర్తి టౌన్: అంధత్వ నివారణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలిన జిల్లా వైద్యాధికారి రవీందర్‌గౌడ్ అన్నారు. గురువారం మండలంలోని శాతపురంలో కంటి కంటి వెలుగు శిభిరాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దేవరుప్పుల : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కంటివెలుగు శిబిరాలు పేదలపాలిట వరమని ఎంపీపీ బస్వ సావిత్రి అన్నారు. గురువారం మండలంలోని పొట్టిగుట్టతండాలో కంటివెలుగు శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ శిబిరంలో 150 మందికి వైద్య చికిత్సలు చేసి అవసరార్థులకు కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఎంపీడీఓ రవీందర్, సర్పంచ్ మూడ శంకర్ నాయక్, ఎంపీటీసీ సభ్యురాలు దుబ్బాక కవిత రత్నాకర్‌రెడ్డి, ఉపసర్పంచ్ అజ్మీరా పార్వతీ, డాక్టర్ మనోజ్, ఆప్తమాలిస్టు ఝాన్సీ, డీఇఓ జావీద్ తదితరులు ఉన్నారు.

కేంద్రప్రభుత్వ విధానాలను వ్యతిరేకించాలి



జఫర్‌గఢ్: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించాలని సీపీఐ మండల కార్యదర్శి జువారి రమేష్ కోరారు. పార్టీ ఆధ్వర్యంలో మండలంలోని ఉప్పుగల్లులో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు కార్మికులతో కలిసి ఇంటింటా ప్రచారాన్ని గురువారం నిర్వహించారు. అనంతరం ప్రచార కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో, కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రాకుండా ప్రజలు అడ్డుకోవాలన్నారు. నాయకులు పెండ్యాల సమ్మయ్య, మంద బుచ్చయ్య, సతీష్, మధు, రాజు, ఐలయ్య, మహేందర్, లక్ష్మయ్య, రాజిరెడ్డి, రాజు, యాకుబ్‌పాష పాల్గొన్నారు.

రేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం

బచ్చన్నపేట: మండలంలోని బండనాగారంలో శ్రీ రేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయ కమిటీ బాధ్యులు విగ్రహ ప్రతిష్ఠాపణోత్సవాల ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ శుక్రవారం గణపతిపూజ, మాతృకా యోగిని వాస్తు, క్షేత్రపాలన నవగ్రహ, మండపారాధన, అగ్ని ప్రతిష్ఠ, శనివారం మండప స్థాపిత రుద్ర శ్రీసూక్త, దుర్గ, భూసూక్త హవనం ఉంటుందన్నారు. 30న ప్రతిష్ఠా మూర్తుల మూలమంత్ర హవనం, గర్తవ్యాసం, యంత్రప్రతిష్ఠ, ప్రాణప్రతిష్ఠ, అనంతరం ప్రథమపూజ సర్వదర్శనంతో ఉత్సవాలు ముగుసా యన్నారు. ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కమిటీ బాధ్యులు కోరారు.

అన్నదానం

జనగామ రూరల్: పట్టణానికి చెందిన ఉదయభాస్కర్, అర్చన దంపతుల కుమారుడు హర్షిత్ పుట్టిన రోజు సందర్భంగా గురువారం అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక రైల్వేస్టేషన్ వద్ద అన్నదానం చేశారు. టీం సభ్యులు నర్సింహులు, సుధాకర్, ప్రకాష్ పాల్గొన్నారు.

అనాథాశ్రమంలో..

జిల్లా కేంద్రానికి చెందిన దేవాన్ పెంటయ్య రెండో వర్ధంతి సందర్భంగా గురువారం పవన్ కళ్యాణ్ హెల్పింగ్ పీపుల్స్ ఆధ్వర్యంలో స్థానిక రాజరాజేశ్వరీ అనాథాశ్రమంలో అన్నదానం చేశారు. కుటుంబ సభ్యులు నర్సింగరావు, సత్యం, బాలమణి, పద్మ, భాస్కర్ తదితరులు ఉన్నారు.